# చెరగని సత్యం

★ శ్రీ చంద్రశేఖర్ ★

కోటమ్మ, తన ఒక్కగాని ఒక్కకొడుకైన వాసుతో రామన్న పాలెంలో నివసిస్తోంది. వాసు అక్కడున్న ఓ వీధిబడిలో, అయిదో తరగతి చదువుతున్నాడు. కోటమ్మ అక్కడక్కడా పనిచేసి కాలం గడుపుతుండేది. ఒకరోజున కోటమ్మ వాసూని పిలిచింది వంటింట్లోనుంచి. వాసు చదువుతోన్న పుస్తకాన్ని అక్కడే పెట్టి అమ్మదగ్గరకెళ్ళి "ఎందుకే" అనడిగాడు.

"ఏం లేదురా బాబూ! తాలింపులోకి మెంతులైపోయాయి, ఓకాని మెంతులు పట్టుకురారా." అంది మూలున్న బొట్టుపెట్టిలో 'కాసీ' తీస్తూ.

"ఆ! నీకెప్పుడూ, నేను చదువుకొనేప్పుడే పనులన్నీ జ్ఞాపకం వస్తాయి, ఉత్తప్పుడు ఏమీ చెప్పవు." అని నసిగినా వెళ్ళక తప్పిందికాదు. అప్పటికే చీకటి పడినా, రోజూ తిరిగే ప్రదేశమవడం చేత భయం లేకపోయింది. కాని మాష్టారు పాఠం చదువుకురాని వాళ్ళని గోడకుర్చీ వేయిస్తానన్నారు. తనకు సగంవరకు పాఠం వచ్చింది. యింకాసగం రావాలి అంతలో వాళ్ళమ్మ పనిచెప్పింది. అయినా త్వరగా వచ్చి చదువుకోవాలని గబగబ నడిచి వెళ్తున్నాడు.

ఊళ్ళో బోర్డువారి బుడ్డిదీపాలు, గుడ్డిగా వీధి మొగల్లో వెలుగుతున్నాయ్. దారి సరిగ్గా కనబడటంలేదు. షావుకారింటికి వెళ్ళడానికి యింకా 'వంకా' వారి సందు మలుపు తిరగాలి. మలుపు దగ్గర ఏదోకనిపించింది రాయిలా. కాని నీడేమోనని ముందుకు వెళ్ళుతుంటే, కాలికేదో మెత్తగా తగిలింది. ఒక్కసారి గుండె ఘుతుక్కుమంది. మొదటది కుక్కేమోననుకున్నాడు. కాని ఎటువంటి అలికిడి వినరాకపోయేసరికి, కొంచెం ధైర్యం చిక్కబట్టుకొని, చేత్తో పైకెత్తి చూసాడు. అదొక సంచి, సంచి బరువుగా వుంది. చుట్టుపట్ల చూసాడు, ఎవరూ కనిపించలేదు. తిన్నగా యింటికి వచ్చాడు. దీపం ముందు కూర్చొని సంచి విప్పుతుంటే, వాళ్ళమ్మవచ్చింది. "ఏమిటిరా! చేస్తుంది" అనడిగింది. వాసుకు సమాధానం చెప్పాలని కూడా తోచలేదు. మూటలాంటి సంచివిప్పి, సంచిలోంచి కాగితాలేవో పైకి తీసాడు. దీపం వెల్తుర్లో రూపాయి నోట్లుగా గుర్తించి యిద్దరూ ఒక్కసారి ఆశ్చర్యపోయారు. కోటమ్మ భయంతో అవన్నీ

లోపలపెట్టి సంచికట్టేయమంది. కాస్త స్థిమిత పడింతర్వాత.

"ఎక్కడిదిరా?" అనడిగింది.

"దొరికాయి" అన్నాడు.

"నిజంగా చెప్పరా బాబూ! ఎక్కడైనా ఎత్తుకొచ్చావేమో, వెళ్ళి, వాళ్ళ కాళ్ళమీదపడి క్షమించమంటా?" అంది అదొకరకమైన భీతితో.

"ఎత్తుకురాలేదే, నిజంగానేనే! ఆ 'వంకా' వారి సందు మలుపు తిరుగుతోంటే కాలికి తగిలింది, ఏమిటాని చూస్తే సంచిమూట, చుట్టూచూచా కాని ఎవరు కనబడలా, అందుచేత తీసుకొచ్చా, కాలికి తగిలినప్పుడు కుక్కేమోనని భయపడ్డా కూడా" అన్నాడు జరిగిందానిలో తన తప్పేమీ లేదని ఋజువు చేసుకొంటూ.

"సరే! రేపు అడుగుదాంలే, పాపం! ఎవరు పోగొట్టుకొన్నారో!" అంది జాలిగా.

వెంకటసుబ్బయ్య ఆవూళ్ళో డబ్బున్న కోమటి. కాని తగని పీనాసి. ప్రతి సంవత్సరం నల్లబజారో, తెల్లబజారో చేసి, పది, పదిహేను వేలు సంపాయిస్తాడు. కాని పైకిమాత్రం సామాన్య కుటుంబీకుడులా ఉంటాడు. ఆరోజుల్లో బేరన్ పుగాకు వ్యాపారం మహాజోరుగా నడుస్తోంది. వెంకటసుబ్బయ్యకూడా, ఆవ్యాపారం మీదకు మళ్లాడు. ఒక సంవత్సరం కన్న, మరో సంవత్సరం ఎక్కువ లాభాలు రాబట్టేవాడు. ఆరోజు పుగాకు అమ్ముకొని వచ్చినడబ్బు సంచిలో మూట కట్టుకొని, ఏదో ఆలోచిస్తూ, వస్తూంటే దారిలో ఎక్కడో మూట జారిపోయింది. ఇంటికొచ్చి చూసుకొన్నాడు-సంచిలేదు. సగం ప్రాణం పోయినట్టయింది. కంగారుగా పొగాకు అమ్మినకంపెనీ దగ్గరకు పరుగెత్తుకెళ్ళాడు. లాభం లేకపోయింది.

ప్రొద్దున్నే ఎట్టాడ్ని పిలిపించి "ఫలానా వెంకటసుబ్బయ్యగారి సంచితో కట్టిన వెయ్యి రూపాయలు రాత్రి ఎక్కడో పోయాయి దొరికినవారు తెచ్చిస్తే, రెండువందల రూపాయిలు యినాం యిస్తారు!"అని చాటింపించాడు వూరంతా.

ఈచాటింపు వెంకమ్మ కూడా వింది. సంచితోసహా వాసుని వెంటబెట్టుకొని వెళ్ళింది. "బాబూగారూ! యిదుగోనండి మీడబ్బు, రాత్రి మాఅబ్బాయి మెంతులు తేవడానికెడుతుంటే దొరికిందండి, మీరు యిస్తానన్న యీనాం యిస్తారా" అనడిగింది సుబ్బయ్యని.

సుబ్బయ్య తనడబ్బు సంచిని గుబుక్కున అందిపుచ్చుకొని, సంతోషంతో డబ్బంతా లెక్కపెట్టుకొన్నాడు. సరిగ్గా వుంది. కాని అంతలో ఏదో తట్టింది. యివ్వవలసిన యీనాం వుత్తినే యిస్తు

న్నట్లనిపించింది. ఎలాగైనా ఎగనామం పెట్టాలనుకొన్నాడు. ఏదో పోగొట్టుకున్న వానిలా ముఖం చిట్లించుకొని, గాభరా పడుతూ,

"అరే, దీంట్లో కొత్త గడియారం వుండాలి, నిన్నే రెండువందలు పెట్టి కొన్నా. అది లేదే, అది తీసుకొస్తే మీాయీానాం యివ్వడానికి నాఅభ్యంతర మేమీాలేదు" అన్నాడు. తనడబ్బు చేతికి దొరికిందనే గర్వంతో కోటమ్మ ఎంతనిజం చెప్పినా వినలేదు. సుబ్బయ్య డబ్బుమాత్రం తన దగ్గరే వుంచుకొని పొమ్మన్నాడు.

కోటమ్మ చేసేదిలేక, గ్రామమునసబుగారి దగ్గర కెళ్ళి, జరిగిందంతా విన్నవించుకొంది. కోటమ్మంటే మునసబుగార్కి కూడా అభిమానమే, కోటమ్మ ఎప్పుడూ సత్యం చెప్పుతుందని తెలుసు. వెంకటసుబ్బయ్యమీాద యిదివరకే రెండు నేరాలొచ్చాయి, కాని సరియైన సాక్ష్యం లేక పోయేసరికి, వెంకట సుబ్బయ్య మాటే గెలిచింది. మున సబుగారు 'సరే' అని ఎట్టాడ్ని, వెంకటసుబ్బయ్యని, పిలిపించాడు. మునసబుగారు జరిగిన విషయమంతా విశదంగా విన్నారు.

"అయితె, యీామె యినాం యిచ్చావా" అనడిగాడు సుబ్బయ్యని.

"ఇప్పుడే గదండి చెప్పింది దానిలో గడియారం ఉండాలి – లేదు. అది యిస్తే యీానాం యివ్వడానికేమీా అభ్యంతరం లేదు" అన్నాడు. తను యిదివరకు రెండు సార్లు గెలిచాననే ధైర్యంతో గర్వంగా మాట్లాడాడు.

"ఒరే ఎట్టీ, అసలు ఏమని చాటింపు వేశావురా" అనడిగాడు.

"ఫలానా, వెంకటసుబ్బయ్యగారివి, సంచితో కట్టిన వేయిరూపాయలు, రాత్రి ఎక్కడో పోయాయి దొరికినవారు తెచ్చిస్తే, రెండువందల రూపాయిలు యినాం యిస్తారని! అని చాటించానండి" అన్నాడు, తనవల్ల తప్పులేదనట్టు చేతులు దండకట్టుకొంటు.

దాంతో మునసబుగారు కోపంతో "అయితే, వెంకటసుబ్బయ్య చాటింపు వేయించినప్పుడు, ఎంతడబ్బు పోయిందో వేయించావు. అయితే గడియారం వుందని ఎందుకు చాటిపించలేదు. నీగడియారం ఈసంచిలోలేదు అంచేత ఈసంచినీది కాదు. నీసంచి యింకొకర్కి దొరికుండాలి. ఈసంచి ఈమెకు దొరికిందంటుంది కాబట్టి వారం రోజుల్లో ఈసంచికోసం ఎవరూ రాకపోతే, ఆమెకే చెందుతుంది" అని తీర్పు చెప్పేసరికి సుబ్బయ్య వంటినిండా జెర్రిలు ప్రాకినట్లైంది. ఆమర్నాడే కోటమ్మకి యినాం యిచ్చి మిగిలిన డబ్బు తెచ్చుకున్నాడు గుప్ చిప్‌గా.

——(o)——